సాక్షి
మంచిర్యాల
మంగళవారం । 26 । నవంబర్ । 2024



ఉద్యాన నర్సరీ వెలవెల

మొక్కలు, తోటలతో కళకళలాడిన భీమారం లోని ఉద్యాన నర్సరీ, రైతు శిక్షణ కేంద్రం వెలవెలబోతోంది. ఐటీడీఏ అధికారులు పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారింది. 9లో▸

సైన్స్ ఫెస్టివల్‌కు టీచర్

కాసిపేట: ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్(ఐఐఎస్ఎఫ్)కు కాసిపేట మోడల్‌స్కూల్ సైన్స్ ఉపాధ్యాయుడు జాడి ప్రవీణ్ ఎంపికయ్యారు. నవంబర్ 30 నుంచి డిసెంబర్ 3వరకు అస్సాంలోని గౌహతి ఐఐటీలో జరిగే ఇండియా ఇంటర్నేషనల్ ఫెస్టివల్-2024లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ పేర్కొన్నారు. ఉపాధ్యాయుడిని డీఈవో యాదయ్య, ప్రిన్సిపాల్ ఖలీల్, ఉపాధ్యాయులు అభినందించారు.

గరిష్టం/కనిష్టం
28.0 /15.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉత్తరం దిశగా చలిగాలులు వీస్తాయి. చలి తీవ్రత పెరుగుతుంది.

యంత్రాల పనిపై కసరత్తు



ఓసీపీలో బొగ్గు నింపుతున్న షావల్(ఫైల్)

- ప్రస్తుతం పని గంటలు అంతంత మాత్రమే
- భూగర్భ గనుల్లో 50శాతం.. ఓసీపీల్లో 70శాతంలోపే..
- వంద శాతం లక్ష్యంగా కంపెనీ చర్యలు
- ప్రణాళికలు సిద్ధం చేసిన యాజమాన్యం

శ్రీరాంపూర్: సింగరేణిలో యంత్రాల పని గంటల పెంపుపై యాజమాన్యం దృష్టి సారించింది. మెరుగైన ఉత్పత్తి, ఉత్పాదకత కోసం చర్యలు చేపడుతోంది. కంపెనీలోని 22భూగర్భ గనులు, 18ఓసీపీల్లో యంత్రాల ద్వారా బొగ్గు తీస్తున్నారు. వాటి పని తీరును వంద శాతానికి పెంచితే మరింత అభివృద్ధి సాధిస్తుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఇందుకోసం ఇప్పటికే గనులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఉద్యోగులను చైతన్యపర్చిన యాజమాన్యం ఇప్పుడు అమలు దిశగా అడుగులు వేస్తోంది. భూగర్భ గను(యూజీ)ల్లో బొగ్గు ఉత్పత్తి ఎక్కువగా ఎస్‌డీఎల్, ఎల్‌హెచ్‌డీ యంత్రాల ద్వారా జరుగుతోంది. కొన్నింటిలో కంటిన్యూయస్ మైనర్ యంత్రాలు, లాంగ్‌వాల్ టెక్నాలజీ ద్వారా ఉత్పత్తి చేస్తున్నారు. తట్టాచెమ్మాస్‌కు ఏనాడో స్వస్తి చెప్పడంతో గనులన్నీ పాక్షిక, పూర్తి స్థాయి యాంత్రీకరణ గనులుగా మారాయి. కానీ యంత్రాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోకపోవడంతో సామర్థ్యం మేరకు నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవడం లేదు. భూగర్భ గనుల్లో బొగ్గు ఉత్పత్తి వ్యయం అధికమవుతోంది. టన్ను బొగ్గు ఉత్పత్తికి రూ.10,394 వ్యయం అవుతుండగా విక్రయిస్తే రూ.4,854 వస్తుంది. ఈ లెక్కన టన్ను బొగ్గుకు రూ.5,540 నష్టం వస్తోంది. ప్రస్తుతం ఓసీపీల్లో వచ్చే లాభాలతో భూగర్భ గనుల్లో వచ్చే నష్టాలను పూడుస్తున్నారు. భూగర్భ గనుల్లో లాభాలు సాధించడం సాధ్యం కాదు కాబట్టి నష్టాలైనా తగ్గించుకోవాలని యాజమాన్యం పేర్కొంటోంది. ఇందుకోసం భూగర్భ గనుల్లో యంత్రాల పని గంటల పెంపుపై కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం యంత్రాలు వాటికి నిర్దేశించిన పని గంటల్లో సగం కూడా దాటడం లేదు. దీంతో కోల్ కటింగ్ పనులు కూడా మెరుగవ్వాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. కోల్‌కట్టర్లు ప్రస్తుతం 40ఉళ్ల(హోల్స్) కోసం మూడు బ్లాస్టింగ్‌లు చేస్తున్నారు. దీన్ని 50 ఉళ్ల కోసం నాలుగు బ్లాస్ట్ చేస్తే ఉత్పత్తి, ఉత్పాదకత పెరుగుతుందని అంటున్నారు.

గైర్హాజరు, ఖాళీల సమస్య

భూగర్భ గనుల్లో కంపెనీ అనుకున్న లక్ష్యాలను సాధించాలంటే అందుకు తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది. సరిపడా కార్మికులు ఉండాలి. భూగర్భ గనుల్లో 30శాతం మంది విధులకు ఎగనామం పెడుతున్నారు. ఖాళీలు సత్వరమే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. భూగర్భ గనుల్లో 50 ఉళ్ల కోసి నాలుగు బ్లాస్టింగ్‌లు చేయాలంటే ముందుగా అక్కడ రక్షణ పనులు చేయించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందని కార్మికులు పేర్కొంటున్నారు. ఒక ఎస్‌డీఎల్ యంత్రానికి రెండు పని ప్రదేశాలను కేటాయిస్తే కోల్‌కట్టర్‌లు పూర్తి స్థాయిలో నిర్దేశించిన ఉళ్లు చేస్తారని పేర్కొంటున్నారు.

భూగర్భ గనుల్లో యంత్రాలు, వాటి పని గంటలు రోజుకు

యంత్రం	లక్ష్యం	పని చేస్తున్నది
ఎస్‌డీఎల్	14	6.24
ఎల్‌హెచ్‌డీ	14	6
కంటిన్యూయస్ మైనర్	10	7.44
లాంగ్‌వాల్	16	3.36

ఓసీపీల్లో యంత్రాలు.. వాటి వినియోగం (రోజుకు గంటల్లో..)

యంత్రాలు	సంఖ్య	నిర్దేశించింది	చేస్తున్నది
షావల్స్	66	19.4	11.8
డంపర్లు	425	18.2	8.2
దోజర్లు	109	15.8	4.6
డ్రిల్స్	48	19.4	5.5
ఇతర యంత్రాలు	175	17.5	4.8
మొత్తం	828	18.0	7.2

ఓసీపీలపైనే ఆధారం..

కంపెనీ లాభాలు గడించడానికి ఓసీపీలే ఆధారం. వాటిలో లక్ష్యాన్ని సాధిస్తే అద్భుత ఫలితాలు సాధించవచ్చని, యంత్రాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటే చాలని అధికారులు అంటున్నారు. ఓసీపీల్లో ఓవర్ బర్డెన్ మట్టి పనులను కంపెనీ కాంట్రాక్ట్ సంస్థలకు అప్పగించి తీయిస్తోంది. బొగ్గును మాత్రం కొన్ని ఓసీపీల్లో అవుట్ సోర్సింగ్ ఇచ్చిన కూడా ఎక్కువ గనుల్లో మాత్రం కంపెనీ నేరుగా తీస్తోంది. ఓసీపీల్లో బొగ్గు లోడ్ చేయడంలో షావల్స్ పాత్ర కీలకంగా ఉంటుంది. కంపెనీ వ్యాప్తంగా అన్ని ఓసీపీల్లో 3 క్యూబిక్ మీటర్ల నుంచి 15 క్యూబిక్ మీటర్ల బొగ్గు లోడ్ చేసే సామర్థ్యం ఉన్న షావల్స్ ఉన్నాయి. ఈ షావల్ నిర్దేశించిన పని గంటల్లో 70శాతం లోపే పని చేస్తున్నాయి. ఒక షావల్ రోజుకు దాని నిర్వహణ సమయం పోను 19.4 గంటలు పని చేయాల్సి ఉంటుంది. కానీ సగటున 11.2 గంటలే పని చేస్తున్నాయి. ఇలా డంపర్లు, దోజర్లు, డ్రిల్స్ అన్ని కూడా వృథా సమయాన్ని వినియోగించుకుంటే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని కంపెనీ వర్గాలు పేర్కొంటున్నాయి.

స్పేర్స్ కొరతతో బ్రేక్ డౌన్లు

భూగర్భ గనుల్లో కొన్ని కాలం చెల్లిన ఎస్‌డీఎల్ యంత్రాలు వినియోగిస్తున్నారని ఆరోపణ ఉంది. స్పేర్స్ కొరత తీవ్రంగా ఉంది. వచ్చే స్పేర్స్ కూడా నాసిరకంగా ఉంటున్నాయని ఆపరేటర్లు పేర్కొంటున్నారు. ఇక ఓసీపీల్లో షావల్స్, డంపర్లు కూడా కొన్ని పాతబడ్డాయి. వాటికి కావాల్సిన స్పేర్ పార్ట్స్ కొరత ఉంది. ఈ కారణాలతో భారీ యంత్రాలు తరచు బ్రేక్‌డౌన్‌లు కావడంతో యంత్రాల పనిగంటలు తగ్గి ఉత్పత్తి, ఉత్పాదకతపై ప్రభావం పడుతోందని కార్మిక సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.

ఆర్టీసీలో సౌరకాంతులు

- పగలంతా సోలార్ పవర్
- విద్యుత్ బిల్లులు ఆదా
- పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత



మంచిర్యాల బస్‌స్టేషన్‌పై సోలార్ పలకలు

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీ అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటోంది. కరెంటు బిల్లుల భారాన్ని తగ్గించుకోవడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తోంది. పగలంతా సోలార్ విద్యుత్‌తో పనులు చక్కబెట్టుకుంటూ విద్యుత్ ఆదా చేస్తోంది. ఖాళీ స్థలాలను సద్వినియోగం చేసుకుంటూ మంచిర్యాల ఆర్టీసీ బస్‌స్టేషన్, డిపో గ్యారేజ్ భవనాలపై రూఫ్‌టాప్ ప్లాంట్లు నెలకొల్పి సౌర వెలుగుల బాట పట్టింది.

ఏర్పాటు ఇలా..

జిల్లాలో ఏకైక డిపో మంచిర్యాలలో 151 బస్సులు ఉన్నాయి. 62వేల కిలోమీటర్లకు పైగా తిప్పుతూ 63వేల మందికి పైగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నారు. బస్‌స్టేషన్, డిపోలో వివిధ అవసరాలకు విద్యుత్ తప్పనిసరి. ఇందులో భాగంగా 2020 జనవరి నుంచి బస్‌స్టేషన్ రూఫ్‌పై 14.5 కిలోవాట్స్, గ్యారేజ్‌పైన 10 కిలోవాట్స్ సౌర వ్యవస్థ అందుబాటులోకి తీసుకొచ్చింది. సంస్థతో ఒప్పందం ప్రకారం 30 ఏళ్లపాటు మెసర్స్ కార్విక్ కన్సెల్టెన్సీ పర్యవేక్షిస్తోంది. ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌కు యూనిట్‌కు రూ.5.00 చొప్పున తక్కువగా అందిస్తోంది. పగలంతా సోలార్ విద్యుత్ వినియోగిస్తుండగా రాత్రి ఎన్పీడీసీఎల్ కరెంటు వాడుతున్నారు. దీంతో సగానికి పైగా విద్యుత్ బిల్లుల భారం తగ్గుతోంది. 2020 జనవరి తర్వాత సౌర విద్యుత్ వినియోగంతో బిల్లులు సగానికి తగ్గాయి.

భారం పడకుండా..

సోలార్ విద్యుత్ వినియోగంతో ఆర్టీసీపై విద్యుత్ బిల్లుల భారం తగ్గుతోంది. కాలుష్య నివారణతోపాటు చార్జీల భారం 50శాతం మేర తప్పుతోంది. ఖాళీస్థలాల్లో ఆర్టీసీ చేపట్టిన ప్రయోగం విజయవంతం అవుతోంది. సోలార్ పవర్‌తో పర్యావరణానికి ఎటువంటి హాని ఉండదు.
– జనార్దన్, ఆర్టీసీ డీఎం, మంచిర్యాల

బస్ డిపో విద్యుత్ బిల్లులు

	2019 ఆగస్టు	2020 జనవరి
లైటింగ్	రూ.1,24,000	రూ.45,300
గ్యారేజ్	రూ.20,500	రూ.12,300

న్యూస్‌రీల్

కవ్వాల్‌లో జడ్జి పర్యటన



గేట్ నంబర్-1 వద్ద న్యాయమూర్తి

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో లక్సెట్టిపేట కోర్టు జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం పర్యటించారు. గేట్ నంబర్-1 నుంచి సఫారీ ద్వారా అడవిలోకి వెళ్లారు. గోండుగూడ మీదుగా బైసన్‌కుంట వరకు ప్రయాణించి అడవులు, వన్యప్రాణులను తిలకించారు. అడవుల రక్షణ, వన్యప్రాణులు, వాటి సంరక్షణపై రేంజ్ అధికారి సుష్మారావు జడ్జికి వివరించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

మందమర్రిరూరల్: ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. సోమవారం మందమర్రి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించి తరగతి గదులు, మూత్రశాలలు, వంటశాల, రికార్డులు, ఆహార సామగ్రి నిల్వల రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. కాసేపు విద్యార్థులతో మాట్లాడి విద్యాబోధనపై తెలుసుకున్నారు. వార్షిక పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో పలు రికార్డులు పరిశీలించారు. ధరణి పోర్టల్‌లో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలని తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు సూచించారు.

బెటాలియన్‌లో డీఐజీ తనిఖీ



మొక్క నాటుతున్న డీఐజీ సిద్దిఖీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌ల డీఐజీ ఎం.ఎస్.సిద్దిఖీ సోమవారం తనిఖీ చేశారు. సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం బెటాలియన్ ఆవరణలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. బెటాలియన్ వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. పరిపాలన ప్రధాన కార్యాలయాన్ని సందర్శించి మినిస్టీరియల్‌లోని విభాగాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. రికార్డులకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ వెంకటరాములు, అసిస్టెంట్ కమాండెంట్ కాళిదాసు, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజాపాలన విజయోత్సవాలు

పాతమంచిర్యాల: జిల్లాలో మంగళవారం నుంచి ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించనున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా ఉపాధి హామీ పథకం విభాగంలో పలు అభివృద్ధి పనులకు అధికారులు సమాయత్తం చేశారు. జిల్లాలోని 311 గ్రామ పంచాయతీల్లో రూ.40 కోట్లతో 1906 పనులు మార్చి 31లోగా నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎస్.కిషన్ తెలిపారు. మహిళా శక్తి ఉపాధి భరోసా, పొలంబాట, వన మహోత్సవం, జలనిధి, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, మహిళా సంఘాల బలోపేతం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఐదుగురు ఎస్సైల బదిలీ

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న ఐదుగురు ఎస్సైలను బదిలీ చేస్తూ మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సీపీ శ్రీనివాసులు ఓ ప్రకటన విడుదల చేశారు. మంచిర్యాల టౌన్ ఎస్సై-3 సీహెచ్.సనత్‌కుమార్‌ను జూలపల్లి ఎస్‌హెచ్‌వోగా, వీఆర్‌లో ఉన్న టి.ఉదయ్‌కిరణ్‌ను ఎన్టీపీసీ ఎస్‌హెచ్‌వోగా, ఎన్టీపీసీ ఎస్‌హెచ్‌వో కే.సతీష్‌ను వీఆర్‌కు, వీఆర్‌లో ఉన్న కే.వెంకటేశ్వర్‌రావును చెన్నూర్ టౌన్ ఎస్సై-2గా, జూలపల్లి ఎస్‌హెచ్‌వో ఎన్.శ్రీధర్‌ను పెద్దపల్లి సీసీఎస్‌కు బదిలీ చేశారు.

దగ్గు, జలుబు, జ్వరం..!



ఆస్పత్రిలో అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్(ఫైల్)

- ప్రతీ ఇంట్లో ఒకరు బాధితులు
- చలికాలంలో శ్వాసకోశ సమస్యలు

మంచిర్యాలటౌన్: జిల్లాలో చలి తీవ్రతతో ప్రజలు దగ్గు, జలుబు, జ్వరం బారిన పడుతున్నారు. వాతావరణంలో మార్పులు, పెరిగిన చలి ప్రభావంతో అనారోగ్యానికి గురవుతున్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు క్షేత్రస్థాయి పర్యటనలు చేసినా వ్యాధుల సంఖ్య పెరుగుతూనే ఉంది. సీజనల్ జ్వరాలు, టైఫాయిడ్, డయేరియా, నిమోనియా వంటి వ్యాధులకు ప్రజలు గురికాగా, ప్రస్తుతం దగ్గు, జలుబు, జ్వరంతో సతమతం అవుతున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది వాతావరణంలో మార్పులు ముందస్తుగా రావడం, నవంబర్‌లోనే చలి తీవ్రత పెరగడంతో జిల్లావ్యాప్తంగా ఉష్ణోగ్రతలు తగ్గిపోతున్నాయి. దీంతో చిన్నారులు, వృద్ధులకు మరింత ప్రమాదకరంగా మారుతోంది. కొందరు చిన్నారులు జ్వరంతోపాటు శ్వాసకోశ ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు కరోనా సమయంలో తీసుకున్న జాగ్రత్తలనే తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. బయటకు వెళ్లినప్పుడు మాస్కు ధరించడం, చలి నుంచి రక్షణ కోసం ఉన్ని దుస్తులు వాడడం, చలి గాలులు నేరుగా తగలకుండా కాపాడుకోవడంతోపాటు వేడి ఆహారం తినేలా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిక లెక్కల ప్రకారం ఈ ఏడాది నవంబర్ 23వరకు జిల్లాలో 16,130 మందికి జ్వరం రాగా, డయేరియా 126 మందికి, టైఫాయిడ్ 195 మందికి, నిమోనియా 11 మందికి వచ్చింది. అనధికారికంగా వీటి సంఖ్య రెట్టింపు కంటే ఎక్కువగానే ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

జాగ్రత్తలు తీసుకోవాలి

జిల్లాలో చలి తీవ్రత పెరుగుతోంది. ప్రజలు తీసుకునే ఆహారం, తాగునీటి విషయంలో జాగ్రత్తలు పాటించాలి. దగ్గు, జలుబు, శ్వాసకోశ సమస్యలు చలితో వచ్చే అవకాశం ఉంటుంది. చలి నుంచి రక్షణ పొందేలా జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలను వెచ్చగా ఉంచేందుకు ప్రయత్నించాలి. జంకు ఫుడ్, ఐస్‌క్రీం, కేకులు, చాక్లెట్లు, ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన ఆహారం తీసుకోవద్దు. జలుబు, దగ్గు ఉన్నప్పుడు మాస్క్ ధరిస్తే మంచిది.
– డాక్టర్ హరీశ్‌రాజ్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి

అర్జీల పరిష్కారంపై దృష్టి సారించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ




అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. భూ సమస్యలు, పింఛన్, పరిహారం, తదితర సమస్యలపై పలువురు దరఖాస్తులు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీఓలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

- ధరణి పోర్టల్‌లో చేసుకున్న దరఖాస్తును పరిష్కరించాలని జన్నారం మండలం పొనకల్ గ్రామానికి చెందిన రాజన్న వినతిపత్రం అందజేశాడు.
- ఇందారం ఓపెన్ కాస్టులో ముంపునకు గురైన తన భూమికి నష్టపరిహారం ఇప్పించాలని జైపూర్ మండలం టేకుమట్ల గ్రామానికి చెందిన గాడిపెల్లి సుధాకర్ కోరాడు.
- తాను పత్తి సాగు చేయగా.. ఆన్‌లైన్ వరిగా నమోదు కావడంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో పత్తి విక్రయించలేకపోతున్నానని, న్యాయం చేయాలని మందమర్రి మండలం ఆదిల్‌పేట గ్రామానికి చెందిన గురుండ్ల గంగుబాయి విన్నవించింది.
- ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు ఇల్లు కూలిపోయిందని, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఆర్థిక సహాయం అందించాలని చెన్నూర్ పట్టణంలోని కుమ్మరి బొగుడ ప్రాంతానికి చెందిన సర్వర్ ఉన్నిసా బేగం వినతిపత్రం అందజేసింది.
- హాజీపూర్ మండల శివారులో ఇల్లు, భూమి ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపులో పోయిందని, మాకు రావాల్సిన నష్టపరిహారాన్ని కొందరు కాస్తుదారులమని తీసుకున్నారని, విచారణ జరిపి న్యాయం చేయాలని చందనాపూర్‌కు చెందిన దేవి రామయ్య కోరాడు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి




మేము తాత, తండ్రి నుంచి గత 50 ఏళ్లుగా తాండూర్ మండలం కాసిపేట గ్రామ శివారులో సర్వే నంబర్ 37/9/16లో 2 ఎకరాల భూమి సాగు చేసుకుంటున్నాం. ఇటీవల కొందరు కబ్జా చేయడానికి చూస్తున్నారు. ఈ భూమిపై విచారణ జరిపి న్యాయం చేయాలి.
– సుంకరి విక్రమ్, గ్రామం: కాసిపేట, మం: తాండూర్

నీరు రావడం లేదు



లక్సెట్టిపేట మండలం గుల్లకోట(ఆర్ఆర్ఆర్) కాలనీలో మిషన్ భగీరథ నీటి పైప్‌లైన్లు, నల్లా కనెక్షన్లు ఇచ్చారు. ఒక్క రోజు కూడా నీటి సరఫరా జరగడం లేదు. రెండేళ్లుగా అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా ప్యాకింగ్ సమస్య ఉందని చెబుతున్నారు. అధికారులు దృష్టి సారించి నీరందించాలి.
– జి.మల్లేశం, గ్రామం: గుల్లకోట, మం: లక్సెట్టిపేట

ఓసీపీలో సీఐటీయూ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

శ్రీరాంపూర్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకిస్తూ సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. సోమవారం శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిపై జరిగిన కార్యక్రమంలో యూనియన్ డివిజన్ కార్యదర్శి గట్టు మహేందర్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని తెలిపారు. కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం చేకూర్చే విధంగా బొగ్గు బ్లాక్‌లను ప్రైవేటుపరం చేస్తోందని తెలిపారు. నూతన విద్యుత్ సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని అన్నారు. లేబర్ కోడ్‌లు తీసుకువచ్చి కార్మిక వర్గ పోరాటాన్ని నిర్వీర్యం చేస్తున్నారని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులకు శ్రమకు తగ్గ వేతనం రావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కాశిపేట రాజేశం, సంపత్, సమ్మన్న, నరేష్, శ్రీనివాస్, కుమార్ పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల హక్కుల సాధనకు పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్

బెల్లంపల్లి: రైల్వే కార్మికుల హక్కుల సాధన కోసం పోరాడుతున్న ఏకైక సంఘం తమదేనని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజనల్ సెక్రెటరీ పి.రవీందర్ అన్నారు. సోమవారం బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ప్రాంగణంలో, రైల్వే విభాగాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలం నుంచి రైల్వే కార్మికుల సమస్యలు అపరిష్కృతంగా ఉంటున్నాయని తెలిపారు. వచ్చే నెల 4 ,5, 6వ తేదీల్లో జరిగే రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో రైల్వే కార్మికులు, ఉద్యోగులు తమ సంఘానికి ఓట్లు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రైల్వే కార్మికుల సమస్యలపై పోరాడుతున్న యూనియన్‌ను ఆదరించాలని కోరారు. రైల్వేను ప్రైవేట్‌పరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పలువురు మజ్దూర్ యూనియన్‌లో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యుడు నవనీత్‌సింగ్, బెల్లంపల్లి బ్రాంచ్ చైర్మన్ నాగరాజు, సెక్రటరీ జి.సాంబశివుడు, రామగుండం బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రెటరీ అరవింద్, ట్రెజరర్ మోజెస్, కరీంనగర్ డెలిగేట్ పెద్ది శ్రీను, సందీప్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనకు సన్నద్ధం చేయాలి

మంచిర్యాలఅర్బన్: జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక, ఇన్‌స్పైర్ అవార్డు ప్రదర్శనలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని డీఈవో యాదయ్య సూచించారు. స్థానిక ట్రినిటీ హైస్కూల్‌లో ఈ నెల 30న, డిసెంబర్ ఒకటిన ఒకే వేదికపై ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఒక ప్రాజెక్టుతో ఒకే విద్యార్థికి అనుమతి ఉంటుందని, థర్మకోల్, ప్లాస్టిక్‌కు బదులు పర్యావరణహిత పదార్థాలు ఉపయోగించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు డీఎస్‌వో మధుబాబును సంప్రదించాలని తెలిపారు.

క్లుప్తంగా

రెండు ఆలయాల్లో చోరీ



పెద్దమ్మతల్లి ఆలయాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

లోకేశ్వరం(ముధోల్): మండల కేంద్రంలోని పెద్దమ్మతల్లి, బ్రహ్మంగారి ఆలయాల్లో ఆదివారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు పెద్దమ్మతల్లి ఆలయంలో 10 గ్రాముల బంగారం, బ్రహ్మంగారి ఆలయంలో 15 గ్రాముల వెండి అపహరించినట్లు ఆయన పేర్కొన్నారు. వాటి విలువ రూ.90 వేల వరకు ఉంటుందన్నారు. రెండు చోట్ల ఒకే వ్యక్తి చోరీకి పాల్పడి ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

చెరువులోపడి వృద్ధురాలు మృతి



లింగుబాయి మృతదేహం

ముధోల్: చెరువులోపడి వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. సీఐ మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన బుడ్డొల్ల లింగుబాయి (85) ఆదివారం ఉదయం ఇంటినుంచి బయలుదేరి తిరిగిరాలేదు. కుమారుడు దత్తు తెలిసిన చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం సమీపంలోని రాజన్నకుంట చెరువులో మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్సై లక్ష్మారెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. దత్తు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు చెరువుకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులోపడి మృతిచెంది ఉండవచ్చని సీఐ పేర్కొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి



షేక్ రిహాన్(ఫైల్)

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని గుండి ఫైఓవర్ బ్రిడ్జి సమీపంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన యువకుడు మృతి చెందినట్లు సీఐ రవీందర్ తెలిపారు. పట్టణంలోని రాజంపేటకు చెందిన షేక్ రిహాన్ (17) బైక్‌లో పెట్రోల్ పోసుకునేందుకు కేస్లాపూర్ హన్మాన్ మందిర్ పక్కన ఉన్న బంకుకు వెళ్తుండగా రాంగ్‌రూట్లో అతివేగంగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలు కావడంతో రిహాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం ట్రాక్టర్ మరో ఆటోను ఢీకొట్టి బోల్తా పడింది. ట్రాక్టర్ డ్రైవర్ వసాకే లోకాజీపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

యువతిని మోసగించిన కేసులో జైలుశిక్ష

లక్సెట్టిపేట(మంచిర్యాల): ప్రేమ పేరుతో యువతిని మోసగించిన యువకుడికి రెండేళ్ల జైలుశిక్ష, రూ.1500ల జరిమానా విధిస్తూ మున్సిఫ్‌కోర్టు జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ సోమవారం తీర్పునిచ్చినట్లు ఎస్సై సతీష్ తెలిపారు. పట్టణానికి చెందిన ఎట్టెం అరుణ్ దొడపల్లికి చెందిన యువతిని ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని చెప్పి నిరాకరించడంతో బాధితురాలు 2017, నవంబర్1న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై సమ్మయ్య కేసు నమోదు చేశారు. కోర్టు కానిస్టేబుల్ వేణు, లైసెనింగ్ అధికారి గులాం దస్తగిరి సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో నిందితునికి పైవిధంగా శిక్ష ఖరారు చేస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

కెనరా బ్యాంక్ (భారత ప్రభుత్వరంగ సంస్థ) Canara Bank Syndicate

జనరల్ అడ్మినిస్ట్రేషన్ సెక్షన్, సర్కిల్ ఆఫీస్ హైదరాబాద్
MCH No.10-3-163, 10-3-163/A, ప్లాట్ నం.85, రైల్ నిలయం ప్రక్కన, ఎస్.డి.రోడ్, సికింద్రాబాద్-500026. ఫోన్: 040-27725221/23/24/25/26

ఆవరణ కావలెను

దిగువ తెలిపిన లొకేషన్ వద్ద మా బ్రాంచ్ కొరకు మెయిన్ రోడ్‌పై, ముఖ్యంగా గ్రౌండ్ ఫ్లోర్‌లో మరియు అవసరమైన పవర్ లోడ్‌తో స్వాధీనానికి సిద్ధంగా ఉన్న వాణిజ్య స్థలం (వాణిజ్య ఆస్తిగా నిర్మాణం కొరకు అనుమతి కలిగిన) యొక్క యజమానుల నుండి రెండు బిడ్ల విధానం క్రింద ఆఫర్లు కోరబడుచున్నవి.

లొకేషన్, ప్రదేశం	కార్పెట్ ఏరియా
మంచిర్యాల (మంచిర్యాల జిల్లా)	1900 చ.అ. వరకు

దరఖాస్తు ఫారాలను www.canarabank.com లేదా పైన తెలిపిన ఆఫీస్ నుండి లేదా బ్రాంచ్ నుండి పొందవచ్చు. సైట్/ బిల్డింగ్ లేఔట్‌తో పాటు మరియు రెంట్, లీజు కాలవ్యవధి మొ॥గు నిబంధనలు తెలియజేస్తూ దరఖాస్తును "APPLICATION FOR HIRING OF PREMISES FOR MANCHERIAL BRANCH" అని వ్రాసి సీల్డు కవర్‌లో పైన తెలిపిన చిరునామాకు పంపవలెను. దాఖలుకు చివరి తేదీ 17-12-2024న మ.3 గం. వరకు. తదుపరి సమాచారములు, సవరణ, అనుబంధములు ఏవైనా ఉంటే, అవి బ్యాంక్ వెబ్‌సైట్‌లో మాత్రమే ఉంచబడతాయి. బ్రోకర్స్ మినహాయించబడినారు.

ప్రదేశం: హైదరాబాద్
తేది: 25-11-2024
సం/- అసిస్టెంట్ జనరల్ మేనేజర్
హైదరాబాద్ సర్కిల్

సమస్యలు చెప్పుకునేదెలా?

- ఎస్సీ గురుకులాల్లో కానరాని కాయిన్ బాక్స్‌లు
- అధికారుల దృష్టికి వెళ్లని విద్యార్థుల సమస్యలు
- పరిష్కారం కాక ఇబ్బంది పడుతున్న వైనం..
- పట్టించుకోని గురుకుల సొసైటీ ఉన్నతాధికారులు



బెల్లంపల్లిలోని సీవోఈ గురుకుల విద్యాలయ భవనం

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఎప్పటికప్పుడు సమస్యలు ఎదురవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, కుమురంభీం, మంచిర్యాల జిల్లాల పరిధిలో ఉన్న 17 గురుకులాల్లో సమస్యలు తిష్టవేశాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ చుట్టపు చూపుగా మారింది. దీంతో విద్యార్థులు తమ సమస్యలను నేరుగా గురుకుల విద్యాలయాల కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లేందుకు కాయిన్ బాక్స్‌లను ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉన్నా అమలు కావడం లేదు. ఈ విషయంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండడంతో గురుకులాల్లో సమస్యలు 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా ఉన్నాయనే విమర్శలు తల్లిదండ్రుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

కొన్ని గురుకులాల్లో మాత్రమే..

గురుకులాల్లో కాయిన్ బాక్స్‌ల ఏర్పాటు కలగా మారింది. పైలెట్ ప్రాజెక్టు కింద కొన్ని గురుకులాల్లో కాయిన్ బాక్స్‌లను బిగించాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ ప్రక్రియ అంతటా విస్తరించలేదు. హైదరాబాద్ పరిసర ప్రాంత గురుకులాల్లో మాత్రమే ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. వీటి పనితీరు ఏ విధంగా ఉందో, విద్యార్థులు ఎంతమేరకు సద్వినియోగం చేసుకుంటున్నారో తెలియదు. కానీ ఇతర గురుకులాల్లో కాయిన్ బాక్స్‌లు ఏర్పాటు చేయడంలో ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తుండటంతో విమర్శలు మూటగట్టుకుంటున్నారు. మరోవైపు సలహాలు, సూచనల బాక్స్‌ల ఏర్పాటు అతీగతి లేకుండా పోయింది.

మచ్చుకు కొన్ని సమస్యలు..

- విద్యార్థుల డైట్, కాస్మెటిక్ చార్జీలను ప్రభుత్వం ఇటీవల పెంచినప్పటికీ ఇంకా కొన్ని గురుకులాల్లో పూర్తిస్థాయిలో మెనూ పాటించకుండా నిర్లక్ష్యం చేస్తున్నట్లు తెలుస్తోంది.
- మరుగుదొడ్లు , మూత్రశాలలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించడం లేదు. దీంతో విద్యార్థులు దుర్గంధంతో సతమతమవుతున్నారు.
- రోజువారీగా డార్మెటరీల్లో చెత్తా చెదారం తొలగించడంలేదు. బెడ్స్ విరిగిపోయి ఉండటంతో విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఫ్యాన్లు, లైట్ల సమస్యలు కూడా ఉన్నాయి.
- శీతాకాలంలో విద్యార్థులు చన్నీళ్ల స్నానం చేస్తున్నారు. సోలార్ వాటర్ హీటర్లు బిగించాల్సి ఉండగా ఏళ్ల తరబడి నుంచి నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు.
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువవడంతో విద్యార్థుల్లోనూ అవలక్షణాలు అలవడుతున్నాయి. క్రమశిక్షణ రాహిత్యం పెరుగుతోంది.
- విధుల్లో కొందరు ఉద్యోగులు సమయ పాలన పాటించడం లేదు. చిత్తశుద్ధితో బోధన చేయకుండా 'మమ' అనిపిస్తున్నారు.
- ప్రైవేట్ విద్యార్థులకు సరిసమానంగా గురుకుల విద్యార్థులు ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడలేకపోతున్నారు. తెలుగులో మాట్లాడటానికి మొగ్గు చూపుతున్నారు.
- కొన్నిచోట్ల దోబీఘాట్లు నిర్మించకపోగా ఉన్న చోట్ల వినియోగించకపోవడంతో విద్యార్థుల దుస్తులు శుభ్రతకు నోచుకోవడం లేదు.
- క్రీడాసామగ్రి, క్రీడాదుస్తులు సరఫరా చేసినా సక్రమంగా వినియోగించడం లేదు. దీంతో విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపడం లేదు.
- పేరెంట్స్ హాల్ నిర్మించాల్సి ఉన్నా శ్రద్ధ చూపడంలేదు.
- ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో ఏర్పాటు చేసిన సీవోఈలో అధ్యాపకుల పోస్టుల మంజూరు జరగడం లేదు. వీటి విషయంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ గురుకులాలు

ఆదిలాబాద్	ఆదిలాబాద్, బోథ్, ఇచ్చోడ
కుమురంభీం	సిర్పూర్(టి)-(జీ), రెబ్బెన, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, సిర్పూర్(టి)-(బీ)
మంచిర్యాల	మంచిర్యాల, కోటపల్లి, కాసిపేట (బెల్లంపల్లి), బెల్లంపల్లి (సీవోఈ), జైపూర్, మందమర్రి, చెన్నూర్, బెల్లంపల్లి(జీ), లక్సెట్టిపేట

కొన్నింటిలో ఏర్పాటు చేశారు



నూతనంగా బాధ్యతలు చేపట్టిన కార్యదర్శి పైలెట్ ప్రాజెక్టు కింద హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉన్న గురుకులాల్లో కాయిన్ బాక్స్‌లను ఏర్పాటు చేశారు. వీటి ఫీడ్ బ్యాక్ తీసుకుని మిగతా గురుకులాల్లోనూ ఏర్పాటు చేయాలనే తలంపులో ఉన్నారు. కాళేశ్వరం జోన్‌లో ఇంకా ఆ ప్రక్రియ ప్రారంభం కాలేదు.

– అరుణకుమారి, జోనల్ అధికారి, కాళేశ్వరం జోన్

రిమ్స్‌లో అరుదైన శస్త్ర చికిత్స



శస్త్ర చికిత్స అనంతరం చిన్నారితో వైద్యులు

ఆదిలాబాద్‌టౌన్: కిడ్నీ స్టోన్‌తో బాధపడుతున్న 15 నెలల చిన్నారికి అత్యాధునిక లేజర్ టెక్నాలజీతో అరుదైన శస్త్ర చికిత్స చేసినట్లు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. సోమవారం రిమ్స్ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనగామకు చెందిన రజిత కూతురు శృతి కిడ్నీ స్టోన్ సమస్యతో బాధపడుతుండగా యూరాలజీ ప్రత్యేక వైద్య నిపుణులు కార్తీక్ ఆధ్వర్యంలో అనస్తీషియా వైద్య సిబ్బంది ఎలాంటి కోతలు లేకుండా అత్యాధునిక లేజర్ టెక్నాలజీతో స్టోన్ తీసివేసినట్లు తెలిపారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశామన్నారు. శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించిన వైద్య సిబ్బందిని అభినందించారు.

పోడు సాగుకు యత్నించిన వారిపై కేసు



అడ్డుకుంటున్న రేంజ్ అధికారి

వేమనపల్లి: నీల్వాయి కొత్తగూడం శివారులోనిరిజర్వు ఫారెస్ట్‌లో పోడు సాగు కోసం యత్నిస్తున్న ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు నీల్వాయి అటవీ రేంజ్ అధికారి అప్పలకొండ తెలిపారు. కొత్తగూడంకు చెందిన జంబి భీమయ్య, భారత రామయ్య, ఓల దుర్గయ్య, చింతల లక్ష్మయ్య, కత్తెర్ల సమ్మయ్య, మానేపల్లి మల్లేశ్, జంపం మధుకర్ అడవిని ఆనుకుని ఉన్న రిజర్వు ఫారెస్ట్ భూమిలో తంగేడు, తునికి పొదలను నరికేస్తుండగా డెప్యూటీ రేంజ్ అధికారి ప్రమోద్‌కుమార్, ఎఫ్‌బీవో మహిపాల్, బేస్ క్యాంపు సిబ్బంది అడ్డుకున్నారు. ఎఫ్ఆర్‌వో అప్పలకొండ ఘటన స్థలానికి వెళ్లి గిరిజనులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అడవిలోకి ప్రవేశించడం, చెట్లను నరకడం, పోడుకు యత్నించడం, వన్యప్రాణులను వేటాడటం చట్టరీత్యా నేరమన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ ఏపీవో వసంత్‌రావు



అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ ఏపీవో వసంత్‌రావు

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఏపీవో వసంత్‌రావు అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇంద్రవెల్లి మండలం వాడ్గాం గ్రామానికి చెందిన విజయలక్ష్మి తనకు ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని, ఉట్నూర్ మండలం చిన్నుగూడ గ్రామానికి చెందిన దుర్గుబాయి తనకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని, ఇచ్చోడ మండలం దుబార్పేట్ గ్రామానికి చెందిన విలాస్ తనకు జిరాక్స్ సెంటర్ కోసం లోన్ కల్పించాలని వేడుకున్నారు. ఇంకా పింఛన్, రెండు పడకల గదుల ఇళ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయం, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఏపీవో సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, పీహెచ్‌వో సందీప్‌కుమార్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాయమాటలు చెప్పి.. డబ్బు కాజేసి..



బాధితుడు గంగాధర్

భైంసాటౌన్(ముధోల్): పింఛన్ ఇప్పిస్తానని చెప్పి ఓ వృద్ధుడి వద్ద నుంచి గుర్తు తెలియని వ్యక్తి డబ్బు కాజేసిన ఘటన సోమవారం పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం.. కుభీర్ మండలం మాలేగాంకు చెందిన గంగాధర్ భైంసాలోని ఎస్‌బీఐ బ్యాంకు నుంచి రూ.30వేల నగదు డ్రా చేశాడు. బయటకు రావడంతో ఓ గుర్తు తెలియని వ్యక్తి మాటలు కలిపి నీకు నెలకు రూ.28వేల పింఛన్ ఇప్పిస్తానని నమ్మబలికాడు. బస్టాండ్ ఎదురుగా గల ప్రభుత్వ ఏరియాస్పత్రి వరకు తీసుకెళ్లి అతని వద్ద నుంచి రూ.19వేలు తీసుకున్నాడు. సార్ దగ్గర సంతకం పెట్టుకుని వస్తానని అతన్ని బయటే ఉంచి లోనికి వెళ్లి తిరిగి రాలేదు. అక్కడే పికెటింగ్‌లో ఉన్న పోలీసులకు తెలుపడంతో ఆస్పత్రి సీసీ కెమెరాలు పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీ



దొంగలు పగులగొట్టిన బీరువా

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని చింతపండువాడకు చెందిన చెట్ల దిలీప్ ఇంట్లో సోమవారం తెల్లవారు జామున చోరీ జరిగినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం దిలీప్ తన భార్య సంధ్యారాణి, కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 23న ఇంటికి తాళం వేసి తీర్థయాత్రలకు వెళ్లాడు. గమనించిన గుర్తు తెలియని దుండగులు తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. స్థానికులు గమనించి ఇంటి యజమానికి, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనలో బీరువాలో ఉంచిన 15 గ్రాముల బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుడి బావమరిది వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

సౌత్‌జోన్ బాక్సింగ్ పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ చక్రపాణి

మంచిర్యాలఅర్బన్: కాకతీయ యూనివర్సిటీ స్థాయిలో ఈ నెల 24న జరిగిన బాక్సింగ్ పోటీల్లో మంచిర్యాలకు చెందిన నబిలా అనం ప్రథమస్థానంలో నిలిచి సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికైంది. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న నబిలా అనం కాకతీయ యూనివర్సిటీ తరఫున పోటీల్లో పాల్గొననుంది. సదరు విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి, వైస్ ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ ఇన్‌చార్జి గోపాలకృష్ణ, అధ్యాపకులు గంగయ్య, కుమారస్వామి, తదితరులు అభినందించారు.

వేర్వేరుచోట్ల చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని కిన్వాట్ తాలుకా జవార్ల గ్రామానికి చెందిన మేస్రం వికాస్ (23) ఈ నెల 21న తన ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు టూ టౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

ఉట్నూర్‌రూరల్: మండలంలోని శ్యాంనాయక్ తండాకు చెందిన జాదవ్ భిక్కు (34) అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఈ నెల 17న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆదిలాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై మనోహర్ పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన మహమూద్‌ఖాన్

భైంసాటౌన్(ముధోల్): పట్టణంలోని నిర్మల్-భైంసా జాతీయ రహదారిపై అగ్నిమాపక కేంద్రం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్ర గాయాల పాలయ్యారు. స్థానికుల కథనం ప్రకారం.. ఓవైసీనగర్‌కు చెందిన మహమూద్‌ఖాన్, లాయక్ ద్విచక్ర వాహనంపై వెళ్తూ రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టింది. కారు వెనకే ఉన్న బొలెరో సైతం కారును ఢీకొంది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఇక ఈ-వాహనాల జోరు

నూతన వాహనం తీసుకోవాలనుకుంటే మీకు నచ్చిన కంపనీదే కొనుగోలు చేయండి.. అది మీ ఇష్టం.. కానీ విద్యుత్‌తో నడిచే వాటికి మీ తొలి ప్రాధాన్యత ఇవ్వండి.. భవిష్యత్ తరాలకు, పర్యావరణ వారసత్వ సంపదను సురక్షితంగా అందించే ప్రయత్నం చేద్దాం.. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు



నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ఇతని పేరు జుట్టు చంద్రశేఖర్. రియల్ ఎస్టేట్ రంగంలో పనిచేస్తున్నాడు. వృత్తి కార్యకలాపాల్లో భాగంగా రోజంతా వివిధ ప్రాంతాలు తిరగాల్సి వస్తోంది. ఇతనికి గతంలో పెట్రోల్ తో నడిచే బైక్ ఉండేది. కొన్నినెలల క్రితం దానిని అమ్మేసి ఎలక్ట్రిక్ చార్జింగ్ స్కూటీ తీసుకున్నాడు. పెట్రోల్ ఖర్చు తప్పిందని, కుటుంబ సభ్యులంతా సులభంగా నడుపుతున్నారని చెబుతున్నాడు. నెలకు దాదాపు రూ.3వేలకు పైగా అయ్యే ఖర్చు తప్పిందని చెబుతున్నాడు. అంతేకాకుండా సాధారణ వాహనాలతో పోల్చితే కాలుష్య రహితంగా కూడా ఉంటుందని స్పష్టం చేస్తున్నాడు.



నిర్మల్‌లోని ఓ షోరూమ్‌లో విక్రయానికి సిద్ధంగా ఈ-స్కూటీలు

- విద్యుత్ వాహనాలకు పలు మినహాయింపులు
- రోడ్డు ట్యాక్స్, రిజిస్ట్రేషన్ చార్జీలు వంద శాతం రాయితీ
- ఈవీ నూతన పాలసీ జీవో 41 విడుదలతో వాహనదారుల హర్షం
- పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వ తోడ్పాటు

నిర్మల్‌ఖిల్లా: రోజురోజుకూ పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరల సమస్యను అధిగమించడం సగటు మానవులకు కత్తిమీద సాములా మారింది. ఈ నేపథ్యంలో పర్యావరణహితాన్ని, ఖర్చును తగ్గించుకునేందుకు ఎలక్ట్రిక్ వాహనాల వైపు మొగ్గు చూపుతుండడం ప్రస్తుత మార్కెట్లో కనిపిస్తోంది. విద్యుత్ వాహనాలపై రోడ్డుట్యాక్స్, రిజిస్ట్రేషన్ చార్జీలను పూర్తిస్థాయిలో మినహాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వాహనదారుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈ మేరకు 'న్యూ ఈవీ పాలసీ' ఉత్తర్వుల జీవో 41 జారీచేసింది.

మారుతున్న ట్రెండ్...

గతంలో ఇంటింటికీ ఓ సైకిల్ ఉండేది. ప్రస్తుతం కాలం ఉరుకుల పరుగులమయంగా మారింది. ఏ కొద్ది దూరం వెళ్లాలన్నా బైక్ తప్పనిసరి అయ్యింది. ఈ క్రమంలోనే వాహనదారులంతా తమ పాత వాహనాల స్థానంలో విద్యుత్‌తో నడిచే స్కూటీలు, బైక్‌లు, ఇతర వాహనాలపై మొగ్గు చూపుతున్నారు. ఉద్యోగ, ఉపాధి, వాణిజ్య అవసరాలు కలిగిన వ్యక్తులంతా ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఆ వాహనాల సంఖ్య జిల్లాలో గణనీయంగా పెరుగుతోంది. మరోవైపు పెరుగుతున్న వాహన కాలుష్యం రీత్యా ఎలక్ట్రిక్ వాహనాలకు తగిన ప్రోత్సాహంతో కూడిన మినహాయింపులు ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు మరింత ఎక్కువయ్యే అవకాశాలు ఉన్నాయి. వీటికోసం తగినన్ని చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు కూడా అవసరమని వాహనదారులు పేర్కొంటున్నారు. రూ.60 వేల నుండి 2 లక్షల వరకు కూడా ధరల్లో లభ్యమవుతున్నాయి.

పెట్రోల్ ఖర్చు తప్పింది



గతంలో పెట్రోల్ బైక్ ఉండేది. రోజుకు సగటున రూ.200 పెట్రోల్ కోసం వెచ్చించాల్సి వచ్చేది. దాన్ని అమ్మేసి కొన్ని నెలల క్రితం ఎలక్ట్రిక్ బైక్ కొనుగోలు చేశా. రెండు మూడు రోజులకోసారి చార్జింగ్ పెడుతున్నా. పెట్రోల్ ఖర్చు తప్పింది. పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావడం సంతోషాన్నిస్తోంది.

– వోస శ్రీనివాస్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, నిర్మల్

రిజిస్ట్రేషన్ ఉచితం

ఎలక్ట్రిక్ వాహనాలలో 250 వాట్ల కంటే తక్కువ శక్తిని కలిగి ఉండి గంటకు 25 కిలోమీటర్ల కంటే తక్కువ వేగం కలిగిన సామర్థ్యం ఉన్న వాహనాలకు ఎటువంటి రిజిస్ట్రేషన్ అవసరం లేదు. అంతకంటే ఎక్కువ సామర్థ్యం ఉన్నవాటిని మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉండేది. తాజాగా విద్యుత్‌తో నడిచే అన్ని వాహనాలకు కూడా పూర్తిస్థాయి రిజిస్ట్రేషన్ చార్జీలు, రోడ్డుట్యాక్స్ రద్దు చేయడంతో వీటి కొనుగోలు మరింత పెరిగే అవకాశం ఉందని వాహన అమ్మకందారుల డీలర్లు, రవాణాశాఖ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన నాగనాథ్

నార్నూర్: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన పి.నాగనాథ్ ఈ నెల 5 నుంచి 7 వరకు సంగారెడ్డిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొని జాతీయస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఆంజనేయులు తెలిపారు. ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్-17 విభాగంలో ఈ నెల 25, 26 తేదీల్లో హర్యానాలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి హాకీ పోటీల్లో పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సూర్యేశ్వర ఆలయంలో 'కార్తిక' పూజలు



పూజల్లో పాల్గొన్న ఆలయ ఈవో

బాసర: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని బాసరలోని సూర్యేశ్వర ఆలయంలో సోమవారం కార్తిక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష అభిషేకం, రుద్ర త్రిశతి నామార్చన, మహా హారతి పూజలు చేశారు. అంతకుముందు భక్తులు గోదావరినదిలో పుణ్యస్నానాలు ఆచరించి సూర్యేశ్వర ఆలయాన్ని దర్శించుకున్నారు.

నేడు గిరి ప్రదక్షిణ

బాసర(ముధోల్): ఏకాదశి తిథిని పురస్కరించుకుని బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో మంగళవారం ఉదయం 5 గంటలకు అఖండ నామ కీర్తనలతో గిరి ప్రదక్షిణ చేయనున్నట్లు ఆలయ వైదిక బృందం తెలిపింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కాగలరని వారు కోరారు.

నేడు హుండీ లెక్కింపు

బాసర: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారికి భక్తులు కానుకల రూపంలో చెల్లించిన హుండీని మంగళవారం లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి విజయ రామారావు తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

నిర్మల్‌రూరల్: మండలంలోని ముఠాపూర్ గ్రామ శివారులోని వాగులో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. మృతునికి సుమారు 45 సంవత్సరాలు ఉంటాయని, మృతదేహం కుళ్లిపోయి గుర్తుపట్టలేనంతగా ఉందన్నారు. వివరాలకు రూరల్ పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని సూచించారు.